క్లుప్తంగా

నేటి నుంచి ఈదమ్మ జాతర


అమ్మవారి మూలవిరాట్

దౌల్తాబాద్: వేపచెట్టు కింద వెలసిన ఈదమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం జల్దిబిందె, సాయంత్రం బోనాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం రెట్టపట్ల కార్యక్రమంతో పాటు అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు రానున్నారని, తగిన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాలాల: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తాండూరు ఏడీఈ ఆదినారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీనారాయణపూర్, అగ్గనూరు, బాగాయిపల్లి, అన్నసాగర్, పగిడియాల, రాస్నం, సంగాయిపల్లితండా, రేళ్లగడ్డతండా, దౌలాపూర్, గిరిజాపూర్, ముకుందాపూర్ గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో..

బొంరాస్‌పేట: మండల పరిధి బురాన్‌పూర్ 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు మదన్‌పల్లి, మదన్‌పల్లితండాకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బురాన్‌పూర్ ఫీడర్ పరిధి సూర్యానాయక్‌తండా, చెరువు ముందలితండా, బుగ్యానాయక్‌తండా, మల్లెవోనికుంటతండాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

3న సర్టిఫికెట్లు అందజేత

కొడంగల్: మండల పరిధి సంగాయిపల్లి గ్రామంలో దివంగత శివమ్మ, అచ్చప్ప పేరిట ఏర్పాటు చేసిన గ్రంథాలయం ఆధ్వర్యంలో జూన్ 3న ధృవీకరణ పత్రాలను అందజేయనున్నట్లు నిర్వాహకుడు హన్మయ్య తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ ఇంగ్లిష్ కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యాక్రమానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారని, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గర్తుకొస్తున్నాయి..


మాట్లాడుతున్న
మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

దోమ: వీధినాటకాలు నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి కిష్టాపూర్ గ్రామంలో ప్రదర్శింపబడిన మల్లికార్జున వీధినాటకాన్ని కొప్పుల వీక్షించారు. అనంతరం మాట్లాడారు. వీధినాటకాల ద్వారా చరిత్రను గుర్తుకు చేయడం ఎంతో సంతోషంగా కళాకారులను అభినందించారు. కళాకారులను ప్రోత్సహించి, కళాకారులను ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయ ఆవరణలో
హోమం చేస్తున్న భక్తులు

మర్పల్లి: మండల పరిధి పెద్దాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వ్యవస్థాపకుడు పట్లోళ్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మహా అభిషేకం, స్వామి వారికి అలంకరణ, ధ్వజారోహణం, అంకురార్పణ, హోమం చేశారు. ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

పచ్చిరొట్ట కోసం పరేషాన్

జీలుగ, జనుము విత్తనాలకు పెరిగిన డిమాండ్

- అరకొర సరఫరాతో రైతుల అగచాట్లు
- సరిపడా తెప్పించాలంటూ ఏఈఓలతో వాగ్వాదం


ఏపుగా పెరిగిన జనుము

మోమిన్‌పేట: భూసారం పెంపొందించుకునేందుకు ఎరువుగా పచ్చిరొట్ట సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపుతుండగా.. డిమాండ్‌కు సరిపడా జనుము, జీలుగ విత్తనాల పంపిణీ లేకపోవడంతో వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలో వరి, ఆలు, ఉల్లి పంటను సాగు చేసే రైతులు.. ఎక్కువగా జనుము విత్తనాలను ఉపయోగిస్తారు. తొలకరి జల్లులకు పచ్చిరొట్ట, జనుము విత్తనాలను విత్తి రెండు నెలల్లోపు పంటను కలియ దున్నితే.. భూసారం పెరుగుతుంది. అనంతరం ఏదైనా పంటను సాగు చేస్తే.. సత్ఫలితాలను ఇస్తుంది. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది. ఇదే విషయాన్ని వ్యవసాయ అధికారులు ధృవీకరిస్తుండడంతో జీలుగ, జనుము విత్తనాలతో పచ్చి రొట్ట సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. కానీ రాయితీపై ప్రభుత్వం అరకొరా సరఫరా చేస్తుండటంతో అందరికీ అందడం లేదు. సరిపడా విత్తనాలను పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

మొత్తం 30 క్వింటాళ్లు

మండల పరిధి 28గ్రామ పంచాయతీల రైతులకు ప్రభుత్వ కేవలం 30క్వింటాళ్ల మాత్రమే జనుము విత్తనాలను సరఫరా చేసింది. వరి సాగుచేసే మేకవనంపల్లి, రాళ్లగుడుపల్లి, కాస్లబాదు, టేకులపల్లి, చక్రంపల్లి, చీమల్‌దరి గ్రామాల రైతులు జనుమును పచ్చిరొట్ట ఎరువుగా వాడతారు. యాసంగిలో ఆలు, ఉల్లి సాగు చేసే చిన్న కోల్కుంద, కోల్కుంద, ఎన్కతల గ్రామాల రైతులు జనుము వినియోగిస్తారు. సుమారు ప్రతి గ్రామంలోనూ పచ్చిరొట్ట సాగకు జనుమును వాడతారు. అలాంటి మండల రైతులు విత్తనాలు కొరతతో ఇబ్బంది పడుతున్నారు. జనుము విత్తనాల కోసం రైతులు వాగ్వాదానికి దిగుతున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో బస్తాలో 40కిలోల జనుము ఉంటుందని, సబ్సిడీ పోను బస్తాకు రూ.1,448లకు విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక బస్తా విత్తనాలను రెండు ఎకరాల్లో విత్తుకోవచ్చునని వెల్లడిస్తున్నారు.

75 క్వింటాళ్లు కావాలని



ప్రభుత్వం సరఫరా చేసిన 30క్వింటాళ్ల జనుము విత్తనాలు సరిపోవడం లేదు. డిమాండు అధికంగా ఉంది. తొలుత పంపిన విత్తనాలు గ్రామానికి క్వింటా చొప్పున అందడం లేదు. ఏఈఓలతో రైతులు వాగ్వాదానికి దిగుతున్నారు. మరో 75 క్వింటాళ్లు కావాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– జయశంకర్,
మండల వ్యవసాయ అధికారి, మోమిన్‌పేట

మా గ్రామానికి బస్సు నడపండి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం
అందజేస్తున్న గ్రామస్తులు

పూడూరు: మండల పరిధి కంకల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కోరారు. ఈ మేరకు గురువారం పరిగి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. గతంలో పరిగి, షాద్‌నగర్ వయా కంకల్ మీదుగా బస్సులు నడిపారని, ఇప్పుడు అవే బస్సులను తిప్పాలని పేర్కొన్నారు. బస్ సౌకర్యం లేక కంకల్ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మొన్నటి వరకు విద్యార్థులు ఉన్నత పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు ఇక్కట్లు ఎదుర్కొన్నారని వెల్లడించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, శ్రీకాంత్, నిఖిల్, వీరేష్, అనంతయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఎమ్మెల్యేను కలిసిన బ్రాహ్మణ సంఘం నాయకులు

షాద్‌నగర్: బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు రామ సత్యనారాయణ, అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు రవిశర్మ ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో బ్రాహ్మణులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


తాండూరు రూరల్: సంకిరెడ్డిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శిరీష

- రైతులు తగిన జాగ్రత్తలు పాటించండి
- గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనండి
- అవగాహన కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారుల వెల్లడి


యాలాల: దేవనూరులో
రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

తాండూరు రూరల్: నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిరిగిరిపేట్ క్లస్టర్ ఏఈఓ శిరీష హెచ్చరించారు. గురువారం మండల పరిధి సంకిరెడ్డిపల్లి గ్రామంలో రైతులకు విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడారు. గుర్తింపు పొందిన ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకు విత్తన సంచి, రసీదు భద్రపర్చుకోవాలని చెప్పారు. లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. వ్యవసాయ కార్యాలయంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఏఈఓలు శ్రీను, శివకుమార్, నిషిత, ప్రతిభ, దుర్గాదేవిలు తమ క్లస్టర్ పరిధి గ్రామాల్లో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరన్‌కోట్ పీఎస్ కానిస్టేబుళ్లతో పాటు రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

యాలాల: వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి యాదగిరి అన్నారు. మండల పరిధి దేవనూరు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా విడిగా విత్తనాలను విక్రయించేందుకు వస్తే.. వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. మార్కెట్లో లభ్యమయ్యే పత్తి విత్తనాలు అన్ని బీటీ అని, ఏ కంపెనీ రకాలైన విత్తుకోవచ్చని వివరించారు. వీటితో పాటు యాలాల సొసైటీలో సబ్సిడీపై జీలుగ 30 క్వింటాళ్లు, లక్ష్మీనారాయణపూర్ ఆగ్రోస్ కేంద్రంలో 30 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జీలుగ కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదిస్తే పర్మిట్లు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఆధికృత డీలరు వద్దే..

మోమిన్‌పేట: ఆధికృత డీలరు వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈఓ శ్రీనివాస్ సూచించారు. మండల పరిధి ఏన్కతల గ్రామంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో నకిలీ విత్తనాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయించేందుకు వ్యాపారులు వస్తుంటారని, ధర తక్కువగా ఉందని వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. వ్యవసాయశాఖ నుంచి గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. రసీదు తప్పని సరిగా తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకు రసీదు, విత్తన సంచులను దాచి ఉంచాలని పేర్కొన్నారు.

వానాకాలానికి సిద్ధం కండి

మర్పల్లి: వానాకాలం పంటలకు సాగు భూములను సిద్ధం చేసుకోవాలని బిల్‌కల్ క్లస్టర్ ఏఈఓ జ్యోత్స్న రైతులకు సూచించారు. క్లస్టర్ పరిధి గండ్లమర్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రైతులకు విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సాగుకు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడారు. విత్తనాలు, ఎరువులను గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణంలోనే కొనుగోలు చేయాలని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే.. తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

జీవాలకు టీకా తప్పనిసరి

షాబాద్: మూగజీవాల ఆరోగ్యానికి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు ప్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డిలు సూచించారు. గురువారం మండల పరిధి కుమ్మరిగూడ గ్రామంలో జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాల వేశారు. అనంతరం మాట్లాడారు. గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని, జీవాల ఆరోగ్యంపై కాపలదారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏటా రెండు విడతలు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తుందని, గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి తమ జీవా లకు టీకా వేయించుకోవాలని సూచించారు.

నంబర్ ప్లేట్ లేకుంటే జరిమానా


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

బొంరాస్‌పేట: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ ఎండీ రవూఫ్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధి తుంకిమెట్లలో సిబ్బందితో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్ లేకుండా డ్రైవింగ్ చేయడం వలన కలిగే నష్టాలు, తద్వారా విధించే ఫైన్, శిక్షల గురించి వివరించారు. నంబర్ ప్లేట్ లేని 15 వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. ఇందులో సీఐ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు


చేవెళ్ల: ఆదర్శ పాఠశాల విద్యార్థినిని సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్ల: పదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు–2024 పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్లలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పదిలో 10 జీపీఏ సాధించిన జోత్స్న, సాయిమనోజులకు కలెక్టర్ శశాంక, జిల్లా విద్యాధికారి సుశీందర్‌కుమార్ పలువురు జిల్లా అధికారులు ప్రతిభ పురస్కారాలు అందజేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 10జీపీఏ సాధించి, జిల్లాలో పాఠశాల పేరును నిలబెట్టారని విద్యార్థులను ఉపాధ్యాయులందరూ ప్రత్యేకంగా అభినందించారు.

నందిగామ విద్యార్థికి..

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదిలో విద్యార్థి సమిత్‌సింగ్ 10 జీపీఏ సాధించడంతో ప్రతిభ పురస్కారానికి ఎంపిక అయ్యాడు. దీంతో కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక చేతుల మీదుగా సమిత్‌సింగ్ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

‘ఉపాధి హామీ’ నిర్వీర్యానికి కుట్ర

షాద్‌నగర్: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ ఆరోపించారు. జూన్ 10న హైదరాబాద్‌లో ఈజీఎస్ పథకం పరిరక్షణ కోసం నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధి కాశిరెడ్డిగూడ గ్రామంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. గ్రామాల్లో వలసలను అరికట్టేందుకు తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకాన్ని కేంద్రం రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ పథకం రద్దయితే ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. పొట్టకూటి కోసం మళ్లీ వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. ఉపాధి పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు పనిదినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొలతలు లేకుండా కూలీలకు రోజుకు రూ.600లు చెల్లించాలన్నారు. డిమాండ్ల సాధనకు, పథకం పరిరక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 10న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజు, అంజయ్య, వీరయ్య, మంజుల, సువర్ణ, యాదమ్మ, పార్వతమ్మ, అలివేలు, మంగమ్మ, పద్మమ్మ, బుచ్చమ్మ, మాధవి, చెన్నమ్మ, చంద్రమ్మ, దీప, రత్నమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

రైతులకు అండగా సంఘం

షాబాద్: రైతులకు సహకార సంఘం అండగా ఉంటుందని షాబాద్ సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘం బ్యాంకులో ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతు అన్వర్‌ఖాన్ మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.11వేల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు మృతి చెందితే ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. రైతులకు సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. ఇందులో సంఘం సీఈఓ శివకుమార్ రెడ్డి, డైరెక్టర్ పీసరి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాములు, కిష్టయ్య తదితరులున్నారు.

ఇనుమును కరిగించే కష్టజీవులు


పరికరాలు తయారు చేస్తున్న శ్రామికులు

పెద్దేముల్: ఎంతటి పటిష్టమైన ముడిసరుకునైనా క్షణాల్లో కరిగించే కష్టజీవులు వారు.. ఎర్రటి నిప్పు కణికలో ఇనుప కడ్డీలను ద్రవంగా మార్చి.. సాగుకు కావలసిన పనిముట్లను తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న ఆ శ్రమ జీవులది మహారాష్ట్ర ప్రాంతం. పొట్ట చేతపట్టుకుని.. ఆరు నెలల పాటు సంచార జీవనాన్ని కొనసాగించే వీళ్లు కొడవళ్లు, గొడ్డళ్లు, పారలు, గునపాలు తదితర పరికరాలను తయారు చేస్తూ.. విక్రయిస్తుంటారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో గిరాకీ బాగా ఉందని శ్రామికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- బడిబయట పిల్లలను గుర్తించండి
- సర్కారు బడుల్లో చేర్పించండి
- గడువులోగా ఆదర్శ పాఠశాలల పనులు పూర్తిచేయాలి
- సమీక్షలో మండల ప్రత్యేక అధికారులు
- 3 నుంచి బడిబాట కార్యక్రమం


నవాబుపేట: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోపాల్

తాండూరు రూరల్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామనే విషయాలను తల్లిదండ్రులకు వివరించి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి(మండల ప్రత్యేక అధికారి) ఎంఏ సత్తార్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, ఐకేపీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3వ తేదీ నుంచి 19 వరకు ప్రభుత్వం ‘బడిబాట’ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా బడిబయట పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించాలని ఆయన ఆదేశించారు. అన్ని బడుల్లో మౌలిక వసతులు, యూనీఫాం, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యా పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నట్లు ప్రజలకు వివరించాలని వెల్లడించారు. ఇందులో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఉద్యానశాఖ అధికారి మల్లి కార్జున్, ఏఓ రజిత, మిషన్ భగిరథ ఏఈ సాయి ప్రణీత్, ప్రతిభ, హెచ్‌ఎంలు వైద్యనాథ్, నర్సిరెడ్డి, నాగప్ప, శ్రీనివాస్, రాం నర్సింహారెడ్డి, ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి గోపాల్ అన్నారు. మండల కేంద్రం రైతు వేదికలో ఆదర్శ పాఠశాలలు, బడిబాట గురించి మండల స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన నాలుగు రకాల కాంపోనెంట్స్ పనులు ఏ విధంగా జరుగుతున్నాయోనని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. బడిబాటలో భాగంగా వచ్చే నెల 3 నుంచి 19 వరకు నిర్దేశించిన షెడ్యూలు ప్రకారంగా కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా గ్రూపులు, అంగన్‌వాడీ కార్యకర్తలు బడిబాటలో పాల్గొని, బడిబయటి పిల్లల వివరాలను సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమార్, అధికారులు ప్రసన్న లక్ష్మి, మంజుల వాణి, అబ్దుల్ రెహమాన్, పలువురు ప్రధానోపాధ్యాయులు, వీఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఏపీఎం సిబ్బంది సీసీలు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి సరళాదేవి, చౌడాపూర్ మండల ప్రత్యేక అధికారి ఉపేందర్‌లు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సూచించారు. అనంతరం బడిబాటను చేపట్టి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని చెయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, ఎంఈఓ హబీబ్ అహ్మద్, ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

‘ఆదర్శం’గా ఉండాలి


మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

పరిగి: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను జూన్ 3లోపుగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని ఆదర్శ కమిటీలు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. వచ్చే నెల 3 నుంచి 19 వరకు గ్రామగ్రామాన బడిబాట కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలను బడిలో చేర్పించే విధంగా, ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు పంచాయతీ ప్రత్యేక అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.